

విఎస్‌యు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా సునీత

వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పరిపాలనా భవనంలో శనివారం డాక్టర్ కె సునీత ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. విశ్వవిద్యాలయంలో సోషల్ వర్క్ విభాగంలో ఎన్నో ఏళ్ల నుంచి సహాయ ఆచార్యులుగా స్పోర్ట్ బోర్డ్స్ సెక్రటరీగా పని చేశారు. ఆమె సేవలను గుర్తించిన విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు శనివారం ఆమెకు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ భాద్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. భాద్యతలు స్వీకరించిన డా కె సునీత గారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లికి ధన్యవాదాలు తెలిపారు. ఆచార్య జి.విజయ నంద్ కుమార్ బాబు, డాక్టర్ ఆర్. మధుమతి, సుజా ఎస్ నాయర్, డాక్టర్సాయి ప్రసాద్ రెడ్డి, ,సహాయరిజిస్ట్రార్డాక్టర్ జి.సుజయ్ కుమార్, అనేక విభాగాలకు చెందిన అధిపతులు, భోధన, భోధనేతర సిబ్బంది, విద్యార్థులు నూతన రిజిస్ట్రార్‌గా భాద్యతలు స్వీకరించిన డాక్టర్ కె.సునీతను సన్మానించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సునీత

'కృష్ణపట్నం' పోర్టు ఉనికి కోల్పోతుందా..!

ఆసియాలోనే అతిపెద్ద ఓడరేవు..ముంబయ్, విశాఖపట్నం, చెన్నయ్ ఓడరేవులకు ధీటుగా వెలుగొందిన కృష్ణపట్నం ఓడరేవు ఇప్పుడు వైరాగ్యం కనిపిస్తోంది..నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు, ఎగుమతులు, దిగుమతులతో కళకళలాడిన ఈ ప్రాంతం ఇప్పుడు పాత చరిత్ర కనిపించడం లేదు. నెల్లూరు జిల్లా రూపు రేఖలు మార్చి, తమ బిడ్డలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందని ఆశపడ్డ రైతులు ఇప్పుడు కంట తడిపెడుతున్నారు. ప్రతి గ్రామంలోనూ ఉపాధి కోల్పోయి భవిష్యత్తు పైగా ఎదురుచూస్తున్నారు. నవయుగ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి తప్ప, తట్టమట్టి వేసిన దాఖలాలు కనిపించడం లేదు. అదాని చేతికి వచ్చిన తరువాత అక్కడ పరిస్థితులు అధ్వానంగా కనిపి స్తున్నాయి..ఈ పరిస్థితులు ఇలానే కొనసాగితే కృష్ణపట్నం పోర్టు భవిష్యత్తు అంధకారమే..జిల్లా విభజన తర్వాత మాకు కృష్ణపట్నం పోర్టు ఉందని గర్వంగా చెప్పుకునే జిల్లా వాసులు, గతంలో ఉండేదనే చెప్పుకునే పరిస్థితులు రానున్నాయని స్థానికులు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

- నాడు వైభవం..నేడు వైరాగ్యం
- కంటైనర్ వెజల్స్ కనిపించడం లేదు
- 10 వేల మంది కార్మికుల ఉపాధికి గండి
- కంటైనర్ కథ ముగిసినట్టే ..

ఒకప్పుడు కంటైర్లు వెజిల్స్‌తో కళకళలాడుతోన్న కృష్ణపట్నం పోర్టు...

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : కృష్ణపట్నం పోర్టు సింహపురికి తలమానికగా అనుకునే పరిస్థితులు నుంచి ఇప్పుడు దాని భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారినట్లు కనిపిస్తోంది. బ్రిటీష్ కాలం నుంచి కృష్ణపట్నంకు ఓ చరిత్ర ఉన్నప్పటికీ 1996 అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు.. సముద్రపు ఒడ్డున ఒక చిన్న ఆఫీసు, అందులో ఉద్యోగి, వేణుగోపాల్ కొద్ది మంది వ్యక్తులు మాత్రమే కనిపించేవారు.. టిడిపి ప్రభుత్వం పోర్టు విషయంలో పెద్దగా చొరవ చూపలేదనే చెప్పాలి. శంకుస్థాపన చేసినా భూసేకరణ, నిధులు, సరిగా సాగలేదు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పోర్టుకు మహర్దశ పట్టిందనే చెప్పాలి. నవయుగ కంపెనీ విశ్వేశ్వరరావు, ఆయన కుమారుడు ఇక్కడ పోర్టుపై ప్రత్యేక శ్రద్ధపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ, నిధులు, పిపిపి పద్ధతి పోర్టు అభివృద్ధికి సహకరించింది. 42 బెర్తుల సామర్థ్యంతో నిర్మించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. 12 బెర్తులు పూర్తి చేశారు. యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ నేరుగా కృష్ణపట్నం వచ్చి దీనిని ప్రారంభించారు. ఇక్కడ నుంచి ఓబులాపురం నుంచి ఇనుప ఖనిజం విదేశాలకు ఎగుమతులు చేయడంతో ప్రతి రోజూ వందలాది లారీల ద్వార ముంబయ్ రోడ్డు మీదుగా కృష్ణపట్నం చేరేవి. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని జాతీయ రహదారి నుంచి వెంకటాచలం మీదుగా నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేశారు. రోడ్డు మార్గమే కాదు. వెంకటాచలం నుంచి భారీ వ్యయంతో రైల్వేశాఖ ప్రత్యేక రైలు మార్గాన్ని పోర్టు వద్దకు నిర్మించింది. కేవలం కృష్ణపట్నం పోర్టు ఆధారంగా ఏనిమిది పాయాయిల్ పరిశ్రమలు ఏర్పాటు చేశారు. సింగపూర్, మలేషియా దేశాల నుంచి క్రూడాయిల్ తీసుకొని ఇక్కడ శుద్ధిచేసి, కర్ణాటక, ఎపి, తెలంగాణ, తమిళ నాడుకు ఎగుమతులు చేసే స్థాయికి వచ్చారు. ఎందరికో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కాయి. పోర్టు ఆధారంగా థర్మల్ ఫవర్ ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది. 33 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం, 33 వేల ఎకరాలు ప్రభుత్వం సమకూర్చి ఉంది. చెన్నయ్‌ను తలదన్నే ఓడరేవుగా పోర్టు అభివృద్ధి చెందింది. ఎగుమతులు, దిగుమతులు భారీగా సాగాయి. కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. వేలాది మంది స్థానికులు, స్థానికేతరులకు ఉద్యో గం, ఉపాధి దొరి కింది. ముత్తు కూరు తదితర ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. నెల్లూరు నుంచి ముత్తుకూరు వరకు రియల్ ఎస్టేట్ సాగింది. నిత్యం కళకళాడే పోర్టు ఇప్పుడు విలవిల్లాడుతోంది. అప్పటి పరిస్థితులు కనిపించడం లేదు.

నేడు ఒక్క వెజల్స్ లేదు. కంటైనర్ క్రేన్లుకు పనిలేకుండా ఉన్న దృశ్యం

'కృష్ణపట్నం' పోర్టు ఉనికికోల్పోతుందా..!

కెపిసిఎల్ ఆధ్వర్యంలో నవయుగ కంపెనీ విశ్వేశ్వరరావు, ఎంతో అభివృద్ధి చేసిన ఈ పోర్టును అదాని కంపెనీకి అప్పగించారు. తమ షేర్ మొత్తం ఆ కంపెనీకి అప్పగించి వెళ్లిపోయారు. ప్రతి నిత్యమూ పోర్టు అభివృద్ధిలో అప్పటి సిఇఒ అనిల్‌కుమార్, నవయుగ కంపెనీ యాజమాన్యం తప్పించింది. చుట్టుపక్కలా పర్యావరణం, గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున ఖర్చుచేశారు. అదాని చేతికి వచ్చాక అక్కడ పరిస్థితులు పూర్తిగా మారిపోయినట్లు కనిపిస్తున్నాయి. నవయుగ కంపెనీ నిర్మించిన 12 బెర్తులు తప్ప కొత్తగా ఒక్కటి రాలేదు. కంటైనర్ టెర్మినల్ దాదాపు తరలిపోయినట్లు కనిపిస్తు న్నాయి. శుక్రవారం సర్వేపల్లి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, మీడియా ప్రతినిధులు ఆప్రాంతంలో పర్యటించారు. పర్యావరణం అధ్వానంగా కనిపిస్తోంది. కార్మికులు, ఉద్యోగులతో కళకళలాడే ఆ ప్రాంతం బోసిపోయినట్లు ఉంది. ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోవడంతో వెజల్స్ కనిపించడం లేదు. కంటైనర్ దింపే క్రేన్లు ఖాళీగా ఉన్నాయి. కస్టమ్స్ అధికారుల హడావుడి లేదు. కేవలం కొంత ఐరన్ ఎగుమతులు మాత్రమే జరుగుతున్నట్లు కనిపించింది. స్థానికులు చెప్పిన వివరాలు ప్రకారం సుమారు 10 వేల మంది ఉద్యోగాలు, ఉపాధి దెబ్బతిన్నాయని తెలిసింది. బూడిద చుట్టుపక్కల ప్రజలను ఇబ్బందులు పెడుతున్నట్లు సమాచారం. కేవలం కొన్ని భవనాలు తప్ప, పెద్ద హడావుడి మాత్రం ప్రస్తుతం పోర్టులో ఉండడం లేదు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనాలు అందడం లేదు. కృష్ణపట్నం పోర్టు భవిష్యత్తు ఎలా ఉంటుం దోననే ఆందోళన స్థానికులను జిల్లా ప్రజల కలవరపెడుతున్నాయి. పోర్టు ఉనికికి ప్రమాదం పొంచి ఉన్నట్లు అక్కడ పరిస్థితులు కనిపించాయి. మన పాలకులు ఏం చేస్తారో చూడాలి. పోర్టు పరిస్థితి ఇలానే ఉంటే మిగిలిన పరిశ్రమలు వెళ్లిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి..

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఛైర్ పర్సన్ జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ జిల్లాలో త్రాగునీరు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో పూర్తి చేసిన త్రాగునీటి పథకాలకు వెంటనే గుత్తేదారులకు బిల్లులు చెల్లించాలని అధికారులు ఆదేశించారు. జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. జాతీయఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టి నపనులకు బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయ సీజన్ నాటికి ఇ రిగేషన్ ట్యాంకులు, కాలువల పనుల మరమ్మత్తులు వెంటనే పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల పనులు పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. పూర్తి చేసిన పనులకు బిల్లులు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో కలువాయి జడ్పీటీసీ సభ్యులు అనిల్ కుమార్ రెడ్డి, ఓజిలీ జడ్పిటిసి రవీంద్ర రాజు, వింజమూరు జెడ్పీటి.సి బాలకష్టారెడ్డి, కొండాపురం జెడ్పీటిసి వెంకట్రావు ,దొరవారి సత్రం జెడ్పీటి.సి రమేష్ దుత్తలూరు జెడ్పీటి.సి లక్ష్మీకాంతమ్మ, కో ఆప్షన్ సభ్యులు అల్లా భక్షు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ చిరంజీవి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట్రావు, పంచాయతీరాజ్ ఎస్.ఇ అశోక్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ అరుణమ్మ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి-నెల్లూరు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవ హరించాలని జిల్లా మలేరియా అధి. కారిణి ఈ హుసేనమ్మ పిలుపు నిచ్చారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా శనివారం నగరం లోని మద్రాస్ బస్టాండ్ వద్ద గల సుంకు చెంగన్న స్కూల్లో విద్యార్థులో ర్యాలీ నిర్వహించాడు. అనంతరం దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా మలేరియా అధికారిణి హుసేనమ్మ మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభమైందని, వర్షపు నీరు నిల్వలు ఏర్పడి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఏడాది లాగా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ "లక్ష్యానికి చేరువలో మలేరియా రహిత సమాజం" అనే నినాదంతో దోమల మీద యుద్ధం ప్రకటించాలని పిలుపు నిచ్చిందన్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు కంచి అరవింద కుమార్, ఇతర ఉపాధ్యాయులు, పిల్లలు, ఆరోగ్య కార్యదర్శి రమణమ్మ, ఆశా కార్యకర్త నళిని, మలేరియా పట్టణ సూపర్ వైజర్ శ్రీధర్, మలేరియా పట్టణ హెల్త్ అసిస్టెంట్ నంద కుమార్ పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో 2024-2025 సంవ త్సరమునకు గాను మొదటి విడత వివిధ ట్రేడుల్లో చేరగా మిగిలిన ఖాళీ సీట్లకు రెండో విడత పవేశాల కోసం ఆన్ లైన్ ద్వారా (వెబ్ సైట్) దరఖాస్తులను ఆహ్వానింత్తున్నట్లు ప్రిన్సిపాల్ .జె . హెచ్.హర్షవర్ధన్ తెలిపారు .పది, ఆ పై అర్హత కలిగిన అభ్యర్థులు వెబ్ సైట్ ద్వారా తేది: 24.07.2024 సాయంత్రం 6:00 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాల న్నారు. అనంతరం అప్లికేషన్ ఫామ్ ను పింట్ తీసుకొని భద్రపరుచుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసు కోలేని పక్షములో తేది: 24.07.2024 సాయంత్రం 3:00 గం.ల లోపు ప్రభుత్వ పారి(శామిక శిక్షణా సంస్థ కందుకూరుకు రిజిస్ట్రేషన్ కోసం సంప్రదించాలన్నారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ టంగుటూరు వారు కందుకూరు మండలం అనతసాగరం ఎంపిపిఎస్ పాఠశాల విద్యార్థులకు 5, 000 విలువ గల నోట్ బుక్స్ సెట్లను అందజేశారు. వినీల ఫౌండేషన్ చైర్మన్ చంద్రశేఖర్‌ని వారి ధర్మపత్ని సుభాషిణిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కందుకూరు ఎంఈఓ కే సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

ప్రజాశక్తి-గుడ్లూరు : ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తేనే విద్యా వ్యవస్థలో రాణించి గుర్తింపు వస్తుందని ఎంఇఒలు గోవర్ధన, కె శ్రీనివాసులు ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రామ్మోహన్ రావు అన్నారు. గుడ్లూరు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎం గురునాథ శర్మ ,ద్వారకానపాడు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం గా పనిచేస్తున్న చిత్తూరి సుబ్బారావు పదవి విరమణ సందర్భంగా స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన సన్మాన సభలో వారు ప్రసంగించారు. ఉపాధ్యాయుడు వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. గురునాథ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య వ్యవస్థ నిర్వీరం అయిపోతుందని ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉపాధ్యాయులపై ఉన్నదని పాలకులు విధానాల వలన ఉపాధ్యాయులపై విపరీతమైన ఒత్తిడి పెరిగిందని ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పదవి విరమణ చేసిన గురునాథ శర్మ, సుబ్బారావులను సన్మానం చేసి అభినందించారు.

ప్రజావ్యతిరేకం నూతన నేరచట్టాలు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్రం ప్రభుత్వం నూతన నేర చట్టాలను అమలు చేయాలంటూ ప్రజా వ్యతిరేక నిర్ణయం తీసుకుందని,కరోనా సమయంలో ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా చట్ట సభల్లో ఆమోదింపచేశారని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. శనివారం నెల్లూరు ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నూతన నేర చట్టాల అమలు చేసే ఆలోచన, నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ నూతన నేర చట్టాలను పరిశీలిస్తే ప్రజల సమస్యలపై పోరాటం ఒక నేరంగా పరిగణించబడుతుందన్నారు. ఈ చట్టాలు అమలు చేయడం వల్ల ఏదైనా సమయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, విద్యార్థి యువజన తదితరుల సంఘాలు ,అందులో పని చేసే కార్యకర్తలు, నాయకులు నేరస్తులుగా పరిగణలోకి తీసుకోబడతారన్నారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తే ఉద్యమాలు చేసే వారి చేతులకు బేడీలు వేసి న్యాయస్థానంకు హాజరు పరుస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కొత్త నేర చట్టాలు భారత రాజ్యాంగం ప్రసాదించిన వాక్ ,సభ, స్వేచ్ఛ, స్వాతంత్రాలను, జీవించే హక్కును హరించి వేస్తాయన్నారు. ఈ ప్రజా వ్యతిరేక కొత్త నేర చట్టాలపై ప్రజల్లోకి విస్తతంగా దేశవ్యాప్తంగా చర్చి జరిపి ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్పులు చేర్పులు జరగాలని అప్పటివరకు కొత్త నేరచట్టాలు అమలు జరగకుండా మన పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిపిఐ నాయకులు దామా అంకయ్య మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక కొత్త నేర చట్టాలపై చర్చలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అన్యాయం చేసే విధంగా రూపొందించిన ఈ నేరచట్టాల అమలు నిలుపుదలకై అందరు ఐక్యమై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటి వరకు అమలు అవుతున్న చట్టాలు భారతదేశ సంస్కృతిని ప్రతిబింబించేలా ఉన్నాయని, కేంద్రం ఆమోదించి అమలు చేయాలని చూస్తున్న కొత్త నేర చట్టాలను పార్లమెంట్లో ప్రతిపక్ష పార్టీ సభ్యులను సస్పెండ్ చేసి , నోరు తిరగని సంస్కృత పదాలతో ఐపిసి, సిఆర్, పిసి పేర్లు మార్చి ప్రజల మీద బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చట్ట సభల్లో చర్చ అనేది లేకుండా మోసపూరితంగా వ్యవహరించి ,పార్లమెంటులో కరోనా కాలంలోఆమోదింప చేశారని అన్నారు. బ్రిటిష్ వాళ్ళ కంటే నేర చట్టాలను కఠినంతరం చేశారు అని అన్నారు. ఈ కొత్త నేర చట్టాల అమలును ప్రజలందరూ ఐక్యంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ నూతన నేర చట్టాల అమలుపై పునరాలోచన చేయాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

1న ప్రజా వైద్యులకు సన్మానం

నెల్లూరు : ప్రజారోగ్యవేదిక, డాక్టరు శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా జూలై 1వ తేదిన జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజా వైద్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజారోగ్యవేదిక ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసేవకు అంకితమై వైద్యసేవలందిస్తున్న ప్రజా వైద్యులు రెడ్‌క్రాస్ కేన్సర్ వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టరు టి.లక్ష్మి, అడిషినల్ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టరు ఎస్‌కె. ఖాదరువలి, జిల్లా ప్రధాన వైద్యశాల చిన్నపిల్లల విభాగం డిఇఐసి ఇన్‌ఛార్జి డాక్టరు ఎం.వి.సురేష్‌బాబు, కావలికి చెందిన రిటైర్డ్ డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ ఎన్. ప్రభాకర్ నాయుడులకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సన్మాన కార్యక్రమం అనంతరం ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం, ఎపి ఆరోగ్య హక్కుచట్టం 2024పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, మేధావులు, అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టరు బి.రాజేశ్వరరావు పిలుపు నిచ్చారు.

'ఆదాల' కంపెనీపై విచారణ జరిపించాలి : టిడిపి

ప్రజాశక్తి-నెల్లూరు : మాజీ ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి నిర్వహిస్తున్న ఎపిఆర్ కన్స్ట్రక్షన్ కంపెనీకి సంబంధించి అప్పటి ప్రభుత్వ అండదండలతో అక్రమంగా సిఎఫ్‌ఎంఎస్ లో పొందుపరిచిన రూ.67 కోట్ల బిల్లులకు సంబంధించి పేమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వమే రద్దు చేసిందని, ఈ దొంగ బిల్లుకు సంబంధించిన దీనిపై సమగ్రంగా విజిలెన్స్ విచారణ జరిపించాలని టిడిపి నేత మదన్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. రూరల్ ఎంఎల్‌ఎ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాల ప్రభాకర్ రెడ్డి నయవంచకుడు అని విమర్శించారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం కార్యకర్తలను బలి చేశారన్నారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పై పోటీ చేయాలంటే తన రూ.67 కోట్ల దొంగ బిల్లును మంజూరు చేయాలని ముఖ్యమంత్రి అని కూడా బ్లాక్ మెయిల్ చేసిన ఘనుడు ఆదాల ప్రభాకర్ రెడ్డి అని విమర్శించారు.

సిసిఆర్ కార్డులు అందజేయాలి

కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు : నూతనంగా అధికారంలోకి వచ్చి టిడిపి ప్రభుత్వం గ్రామాలల్లో సభలు నిర్వహించి కౌలు రైతులందరికీ సిసిఆర్ కార్డులు అందజేయాలని ఆ దిశగా కౌలు రైతు చట్టాన్ని సవరణ చేయాలని జిల్లా కౌలురైతు సంఘం డిమాండ్ చేసింది. శనివారం కౌలు రైతు చట్ట సవరణపై కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ శేషారెడ్డి మెమోరియల్ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురునాథం అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ భూ యజమాని సంతకం తప్పనిసరి అన్న నిబంధనల తొలగిం చాలన్నారు. కౌలు రైతులకు అందజేసిన సిసిఆర్ కార్డులున్న ప్రతి ఒక్కరికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. కులాలతో సంబంధం లేకుండా భూమి లేని ఓసి కౌలు రైతులకు రైతు భరోసా పథకంలో లబ్ది చేకూర్చాల న్నారు. గతంలో సంభవించిన వరదల వల్ల దెబ్బతిన్న సోమశిల ప్రాజెక్టు అప్రాన్‌కు ప్రభుత్వం తక్షణమే మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసు కోవాలన్నారు. పంట సాగుబడి చేసే సమయంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు సబ్సిడీగా అందజే యాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య ,రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కే సురేష్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం రాజా, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాల్ ,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్ ,కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పొట్టి పాలెం చంద్రమౌళి, గరికపాటి సురేష్ ,మన్యం వెంకయ్య అల్లం పాటి చిట్టిబాబు, పి పెంచలయ్య ,పరిసబోయిన లక్ష్మయ్య ,గండవరపు సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మైనింగ్ మాఫియాలో కలవరం..

ప్రజాశక్తి-నెల్లూరు

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో మైనింగ్ వ్యవహారంలో అప్పటి అధికార పార్టీకి చెందిన నాయకుల చేతిలో బాధింప పడ్డ బాధితులు ఒకొక్కరు బయటకు వస్తున్నారు. సిఐడి , విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేస్తుండటం కలకలం రేపుతోంది. పోదలకూరు, సైదాపురం తదితర ప్రాంతాల్లో వైసిపికి చెందిన బడా నాయకులు, మంత్రులు యథేచ్ఛగా భారీ యంత్రాల సహాయంతో తెల్లరాయిని విదేశాలకు తరలించి రూ. కోట్లు తమ నింపుకున్నారు. అప్పట్లో న్యాయస్థానాన్ని కొంత మంది ఆశ్రయించినా తెల్లరాయి తవ్వకాలను నిలిపివేయాలంటూ జిల్లా మైనింగ్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినా వారు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. అదే సమయంలో కోర్టును ఆశ్రయించిన బాధితులపై అధికార పార్టీకి చెందిన వారు అక్రమంగా కేసులు బనాయించడం, దాడులకు తెగబడటంతో ప్రాణభయంతో మౌనం వహించారు. సార్వత్రిక ఎన్నికలు జరగటం, ఫలితాలు రావడం ఊహించని విధంగా టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో బాధితులందరూ ఒకొక్కరుగా బయటకు వచ్చి అవినీతి నిరోధక శాఖ అధికారులకు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసి తమకు న్యాయం చేయాలని, అక్రమంగా కోట్లాది రూపాయలను కొల్లగొట్టిన వారి నుంచి రికవరీ చేయాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కార్పొరేషన్‌లో ఏకంగా కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి కోట్ల రూపాయల చేతులు మారాయంటూ ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ఈ కుంభకోణంలో వైసిపి నాయకుల చేతులున్నాయంటూ వాదనలు వినిపించాయి. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాదికారులు విచారణచేసి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గూడూరు, చెన్నూరు ప్రాంతానికి చెందిన గిరిజన వసతి గృహంలోని 21 మంది విద్యార్థులు డయోరియాకు గురి కావడంతో రాష్ట్ర స్థాయి గిరిజన సంఘం నాయకులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు మాజీ ఎంపి, వైసిపి రూరల్‌నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నిర్వహిస్తున్న ఎపిఆర్ కన్స్ట్రక్షన్ కంపెనీకి సంబంధించి 16 ఏళ్ల నాటి రూ.67 కోట్ల కు సంబంధించిన బిల్లు సిఎఫ్‌ఎంఎస్‌లో చేర్చి నిధులు డ్రా చేశారని ఆరోపలు వస్తున్నాయి. ఈ ఘటపై పూర్తి స్థాయిలో విజిలెన్స్ విచారణ చేయాలంటూ టిడిపి డిమాండ్ చేస్తోంది.

వీక్షణం

50 శాతం రాయితీతో దంత వైద్యసేవలు

ప్రజాశక్తి-నెల్లూరు : నారాయణ దంత వైద్యశాలలో జూలై 1వ తేది నుంచి జూలై 31వ తేది వరకు ఉచిత కన్సల్టేషన్‌తోపాటు ఎత్తు, వంకర పళ్లను సరిచేసే క్లిప్స్ తదితర చికిత్సలు 50 శాతం రాయితీతో నిర్వహిస్తున్నట్లు నారాయణ దంత వైద్యశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్ పేర్కొన్నారు.శనివారం నారాయణ దంత వైద్యశాలలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.20 వేల ఖరీదు చేసే మెటల్ బ్రేస్ కేవలం రూ.10 వేలకు అమర్చుతున్నట్లు తెలిపారు. సిరామిక్ బ్రేస్, సెల్ఫ్ లైగేటింగ్ బ్రేస్, పంక్షనల్ అప్లయెన్సెస్, క్లియర్ అలైనర్స్ కు సైతం రాయితీ సౌకర్యం ఉందన్నారు. అనంతరం నారాయణ దంత కళాశాల కో ఆర్డినేటర్ డాక్టరు కె.వి.సునీల్ కుమార్ మాట్లాడారు. ఆర్థోడాంటిక్స్ విభాగాధిపతి డాక్టరు మండవ ప్రసాద్; నారాయణ గ్రూప్ ఏజిఎం సిహెచ్ భాస్కర్‌రెడ్డి, ఎఒ ఉన్నం అరవింద్‌రెడ్డి , ఆర్థోడాంటిక్స్ విభాగం వైద్యులు ప్రసంగించారు.

అధికారులతో ఎంఎల్‌ఎ 'ఇంటూరి' సమీక్ష

ప్రజాశక్తి-కందుకూరు : ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు శనివారం డ్వామా, ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల సమీక్షలో భాగంగా డ్వామా కార్యాలయానికి వెళ్లిన ఎంఎల్‌ఎకు అధికారులు స్వాగతం పలికి సత్కరించారు. ప్రధానంగా ఉపాధిహామీ పథ కానికి సంబంధించి గతంలో చేసిన పనులు, పురోగతి వివరాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాదిలో చేపట్టబోయే పనులకు సంబంధించి ప్రతి పాదనలను మండలాల వారీగా అధికారులు ఆయనకు వివరించారు. రైతులకు ఉపయో గపడేలా వ్యవసాయ అనుబంధ పనులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఎపిడి మదులకు సూచించారు. గత ప్రభుత్వంలో జలకళ ద్వారా నియోజకవర్గం మొత్తంమీద 430 బోర్లు వేయగా కేవలం ఐదింటికి మాత్రమే మోటార్లు బిగించినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్లు లేకపోవడం, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వంటి కారణాలవల్ల మోటార్లు బిగించడంలో జాప్యం జరిగిందని ఎంఎల్‌ఎకు వివరించారు. ఉద్యాన పంటల ఎంపిక, మొక్కల పంపిణీ, ప్రభుత్వ రాయితీలు, తదితర అంశాలపైనా ఎంఎల్‌ఎ సమీక్ష చేశారు. డ్వామా ఎపిడి మదుల, ఐదు మండలాల ఎపిఒలు, ఇసి లు, టిఎ లు, కంప్యూటర్ ,ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

పంచాయతీ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుచ్చిరెడ్డిపాలెం మండల కేంద్రంలోని నగర పంచాయతీ కార్యాలయానికి ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె కమిషనర్ రమణబాబు ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రధానంగా నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తెచ్చారు. దాంతో ఆ సమస్యలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి పరిష్కరించాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను ఆదేశించారు. అదేవిధంగా నీటి నిర్వహణ, పారిశుధ్యం, ప్రజా మరుగుదొడ్ల సమస్యలపై కూడా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆరా తీశారు. బుచ్చి పట్టణ అభివృద్ధిపై యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం వద్దని ప్రశాంతిరెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో డయేరియా కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో దీనిపై దృష్టి సారించాలన్నారు. దోమల వ్యాప్తి జరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పెన్షన్ పంపిణీని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-కోవూరు : జులై 1న పెన్షన్ల పంపిణీ సమర్థవంతంగా నిర్వహించాలని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కోవూరు నియోజకవర్గ ఎంపిడిఒలను ఆదేశించారు. శనివారం నెల్లూరులోని విపిఆర్ నివాసంలో నియోజకవర్గ పరిధిలోని కోవూరు, బుచ్చిరెడ్డి పాలెం, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట ఎంపిడిఒలతో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకొని స్థానిక నాయకుల సహకారంతో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో కోవూరు నియోజకవర్గ పరిధిలో అయిదు మండలాల ఎంపిడిఒలతో పాటు టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల ముఠాపై ప్రత్యేక నిఘా..

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి దుర్గంపై గుప్త నిధులు ముఠాపై ప్రత్యేకంగా పెట్టామని అటవీశాఖ రేంజ్ అధికారి టి.ఉమామహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుర్గంపై యాత్రికులు పర్యాటకులుగా గుప్తనిధులు ముఠా సంచరిస్తున్నారని సమాచారం అందడంతో గతవారం రోజులుగా మూడు టీములను ఏర్పాటు చేసి దుర్గంను జల్లెడ పట్టామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా దుర్గం కొండపై సంచరిస్తుంటే సమాచారం ఇవ్వాలని అట్టి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే గుప్తనిధుల ముఠాపై కొందరు అనుమానితులను గుర్తించామని వారికి నోటీసులు అందించి విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు వైద్యం కల్పించాలి

ప్రజాశక్తి-కావలి : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు అపరిమిత వైద్యసహాయం అందజేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కావలి, ఆత్మకూరు డివిజన్ల యూనియన్ సర్వసభ్య సమావేశం ముసునూరు సాయి క్షేత్రం కల్యాణ మండపంలో ఆళ్ళ కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చౌటేపల్లి రామ్ గోపాల్ రెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ తుంగా సాంబశివరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఇతర యూనియన్ లనుండి దాదాపు 100 విద్యుత్ ఉద్యోగులు ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్లో చేరారు.

138 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-కావలి : కావలి సబ్ కోర్టు ఆవరణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ శోభ అధ్యక్షత వహించి మాట్లాడారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, ఖర్చు కాలయాపన లేని అంతిమ తీర్పును, అలాగే ఇరు పార్టీల వారు సమన్యాయం పొందవచ్చని ఆమె తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ, స్పెషల్ మేజిస్ట్రేట్ పి.పరుసురాం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుధాకర్ కలిసి సివిల్, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు అన్ని కలిపి సుమారు 138 కేసులు పరిష్కారం అయ్యాయని, అలాగే సుమారు రూ.59 లక్షల నగదును పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎ.పి.పి. మృధుల కావలి న్యాయవాద సంఘ ప్రెసిడెంట్ కె.సురేంద్ర రెడ్డి, న్యాయ వాదులు ఎ.ప్రసాద్ రెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి, జి.మాల్యాద్రి, కె.చక్రపాణి, కెన్నెడీ, పి.వి.శివప్రసాద్ రెడ్డి, కలీం రోజ్దార్, వై.వెంకటేశ్వర్లు, ప్రసన్న కుమార్ ఐ.సాయి ప్రసాద్, పి.వి.రమణారెడ్డి, టి.మల్లిఖార్జున, శ్రీ దేవి, జి.మనోరమ, ఇతర జూనియర్ న్యాయవాదులు, లోక్‌అదాలత్ మెంబర్ మాలకొండారెడ్డి, పోలీసులు, కోర్టు సిబ్బంది, వివిధ బ్యాంకు వారు, కక్షిదారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా త్వరలో గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చనున్న నేపథ్యంలో మండలంలోని ఆరు గ్రామాలకు జనసేన తరపున కేటాయించాలని ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరుతామని జనసేన మండలాధ్యక్షులు ఉదయగిరి రవి పేర్కొన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సోమశిల, గౌరవరం, బొమ్మవరం, ఇనగలూరు, కచిర దేవరాయపల్లి, ఆమని సిరివెళ్ల గ్రామాలు కేటాయించాలన్నారు.

పెన్షన్ పంపిణీలో నాయకులు పాల్గొనాలి

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలో 1న జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మండలంలోని గ్రామాలలో ప్రతీ నాయకుడు, సచివాలయ సిబ్బందితో కలిసి పాల్గొనాలని మండల టిడిపి అధ్యక్షురాలు మునగపాటి సునీత పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే మూడు నెలలు కలిపి రూ.7వేలు 1వ తేదీ పంపిణీ చేస్తామని మాటకి కట్టుబడిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని అన్నారు. నాయకులు లబ్ధిదారులు వద్ద పంపిణీ చేసే ఫోటోలను టిడిపి కేంద్ర కార్యాలయానికి పంపించాలని ఆమె పేర్కొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్

ప్రజాశక్తి వరికుంటపాడు : వరికుంటపాడులో ఉన్న సుమారు 4వేల పింఛన్ దారులకు ఇంటి వద్దకే ప్రభుత్వ ఉద్యోగులు వచ్చి పింఛను అందజేస్తారని ఎంపిడిఒ తోట వెంకటకృష్ణ కుమారి తెలిపారు. ఈ పెన్షన్లు పంపిణీ చేసేందుకు సచివాలయ సిబ్బందితో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న 96మందిని నియమించమన్నారు. దాదాపు 4వేలమందికి కలిపి రూ.2,92,69,500 నగదును అందజేస్తామన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ ముమ్మరం చేశారు. శనివారం శానిటైజేషన్‌కు సంబంధించిన అటెండన్స్, కంపోస్ట్ యార్డ్స్, మున్సిపల్ పార్కులు, అనేక ప్రాంతాలలో పర్యటించి ప్రత్యేకంగా వెంగయ్య గారిపాలెంనకు వెళ్ళు రోడ్డుకు ఇరుపక్కల ఉన్నపిచ్చి మొక్కలను, వ్యర్థాలను జెసిబి సహాయంతో తొలగింపు చేశారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

- సిఐటియు రాజకీయ శిక్షణ తరగతులు - సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-కావలి

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు అలుపెరగని పోరాటం చేస్తుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నరసింహారావు సిఐటియు విశిష్టత క్లాసును బోధించారు. ఆయన మాట్లాడుతూ సిఐటియు నిర్మాణం కలిగినదని దేశంలో 60 లక్షల సభ్యత్వాన్ని కలిగి కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. ఐక్య పోరాటాలను ముందుకు తీసుకు వెళ్లడమే సిఐటియు లక్ష్యమన్నారు. మిల్లులలో పని చేసేవారు, చేతివృత్తులలో పనిచేసే వారందరూ శ్రమ జీవులని కార్మికులు ప్రజలు తిరుగుబాటు చేసిన రోజు విప్లవం రాక తప్పదన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చేటప్పుడు సంవత్స రానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను ఊడ గొడుతున్నారన్నారు. సిఐటియు నిర్మాణం ఎంత బలపడితే అక్కడ కార్మికుల సమస్యలపై పెట్టుబడి దారులపై పెద్ద ఎత్తున పోరాడేందుకు తోడ్పడుతుందన్నారు. మండలాల్లో కూడా సిఐటియు నిర్మాణాన్ని బలపరిచేందుకు కార్మికులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసు కొచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సిఐటియు దేశవ్యాప్తంగా జూలై 10వ తేదీన డిమాండ్స్ డేకు పిలుపునిచ్చిందన్నారు. కార్మిక వర్గం దీన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రెండవ క్లాసు సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ఉమా మహేశ్వరరావు మతోన్మాదం కార్మికులపై ప్రభావం అనే క్లాసును బోధించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, సిఐ టియు నాయకులు రెహనాబేగం, గోగుల శ్రీనివాసులు, కె.పెంచల నరసయ్య, పి.పెంచలయ్య, వై.కృష్ణమోహన్, గౌస్, కుమార్, మాల్యాద్రి, తుమ్మల వెంకయ్య క్లాసులకు ప్రిన్స్‌పాల్‌గా వెంకటేశ్వర్లు వ్యవహించారు.

మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని విద్య

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు ఉన్నాయని, ఒత్తిడి లేని విద్యను అభ్యసించి మెరుగైన ఫలితాలు సాధించాలని ఉప విద్యాశాఖ అధికారి కె.గోపాల్ అన్నారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు పురస్కరించుకొని 2023-24 సంవత్సరం లో ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి అత్యున్నత ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా అందజేశారు. విజయాలు ప్రధాన భూమిక వహించిన అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప విద్యాశాఖ అధికారి గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ విద్యార్థులు, ప్రయివేట్ రంగానికి ఏ రూపానా తీసిపోరన్నారు. ప్రభుత్వ రంగంలో ప్రభుత్వ రంగంలో క్వాలిఫై అయిన టీచర్లు బోధిస్తారు. ప్రయివేట్ రంగంలో క్వాలిఫై కానీ వారు బోధిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు ప్రయివేట్ విద్యార్థులతో పోటీ పడుతున్నారని, లక్షల ఖర్చుపెట్టి ప్రయివేట్ రంగంలో చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల కంటే 10శాతం మార్కులు సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ నజీర్ భాషా, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి వి చలపతి శర్మ, జిల్లా కార్యదర్శి ఎం.గంగాధర్, ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ కె.గోపాల్

మాట్లాడుతున్న ఎంఇఒ మస్తాన్‌వలీ

వంటశాలల వద్దే భోజనం వండాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

వంటశాలలు ఉన్నచోటే మధ్యాహ్నం భోజనం తయారు చేయాలని ఎంఇఒ-1 షేక్ మస్తాన్ వలీ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్థానిక బిసి తెలుగు, బిసి ఉర్దూ పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థుల నమోదు, విద్యార్థుల పఠన అభ్యసన, మధ్యాహ్నం భోజనం, స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ పనులను పరిశీలించామన్నారు. మధ్యాహ్న భోజనమును పరిశీలిస్తూ వంట శాలలు ఉన్న చోట తప్పనిసరిగా అక్కడే గ్యాస్‌పై మధ్యాహ్న భోజనం తయారు చేయాలని ప్రధానోపాధ్యాయులు జి.నాగయ్యకు మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు షేక్ మహబూబ్ జానీకి ఆదేశించారు. విద్యా ప్రవేశ్ కార్యక్రమంపై దృష్టి పెట్టి 1వ తరగతి విద్యార్థులకు బోధన చేయాలని అదేవిధంగా విద్యా ప్రవేశం కార్యక్రమంపై దృష్టి పెట్టి విద్యార్థుల నమోదును వేగవంతం చేయాలన్నారు. అనంతరం బిసి కాలనీ ఉర్దూ పాఠశాలలో పదవీ విరమణ పొందిన షేక్ జమీర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి నాగయ్య, షేక్ సర్దార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబసభ్యులతో సన్మాన గ్రహీతలు

రిటైర్డ్ టీచర్‌కు సన్మానం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్‌లోని కొత్తూరు జెడ్‌పి హైస్కూల్ ఇంగ్లీషు ఉపాధ్యాయులు ఆరుమూళ్ల పోలయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ప్రధానోపాధ్యాయులు అమూల్యకుమారి, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 30 యేళ్లుగా ఆయన పొదలకూరు, నెల్లూరు రూరల్ మండలాల్లో ఉపాధ్యాయ వృత్తిలో సేవలు అందించారు. ఈ మేరకు పోలయ్య - సరోజనమ్మ దంపతులను ఉపాధ్యాయులు సన్మానించారు. అనంతరం విద్యాభివృద్ధిలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు కొప్పోలు సుబ్బు - సౌజన్య, ఓరుగుంట నారాయణ - నారాయణమ్మ, పాదర్తి వెంకటరమణయ్య - సునీత దంపతులు, పాదర్తి శ్రీహరి, పాదర్తి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- కౌన్సిలర్లు అభ్యర్థన మేరకు అజెండా అంశాలు వాయిదా
- నారంపేట ఇండస్ట్రియల్ పార్కు సోమశిల నీటి సరఫరా 2 రద్దు
- అధికారుల గైర్హాజరుపై మండిపడ్డ సభ్యులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పురపాలక సంఘం సాధారణ సమావేశం ప్రశాంతంగా జరిగింది. మున్సిపాలిటీ చైర్మన్ గోపారం వెంకట రమణమ్మ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ షేక్.ఫజలుల్లా ఆధ్వర్యంలో పరిపాలక సంఘం సాధారణ సమావేశం నిర్వహించారు. గత ఫిబ్రవరిలో జరిగిన సమావేశంలో వాయిదా వేసిన పలు అంశాలను ఈ సమావేశంలో కౌన్సిల్ నిర్ణయం కోసం ప్రవేశపెట్టారు. మొత్తం 25 అంశాలను కౌన్సిల్ నిర్ణయం కోసం ప్రతిపాదన పెట్టారు. సోమశిల తాగునీటి తరలింపు అంశం తిరస్కరిస్తున్నామని మిగిలిన వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ గోపారం వెంకటరమణమ్మ తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో ఆత్మకూరు ఎంఎల్‌ఎ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 9వ వార్డు కౌన్సిలర్ రమాదేవి మాట్లాడుతూ పురపాలకంలో రూ.13 కోట్లు బకాయిలు చూపుతున్నారని, అవి ఎలా అయ్యాయో వివరాలు తెలియాలన్నారు. పురపాలకంలో రూపాయి ఖర్చు పెట్టాలన్నా కౌన్సిల్ అనుమతి ఉండాలని ఎలాంటి అనుమతులు లేకుండా ఎలా ఖర్చు చేశారని ప్రశ్నించారు. గత వైసిపి పాలనలో ఏకపక్ష విధానాలు నచ్చకనే అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ఆనం రామనారాయణరెడ్డి వెంట నడిచామన్నారు. మున్సిపాలిటీ బకాయిలపై అన్ని వివరాలు అందజేయాలన్నారు. బస్టాండ్‌కు నుడా నిధులు కోటి ఖర్చు చేయడంపై ప్రశ్నించారు. నిధుల వ్యయంపై ఎంక్వయిరీ చేయాలని సూచించారు. కమిషనర్ ఫజలుల్లా మాట్లాడుతూ ఆయా విభాగాల వారీగా బకాయిల వివరాలు వివరించారు. బకాయిలతోపాటు కరెంట్ బిల్లులు బకాయిలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సర్దార్, కౌన్సిలర్లు గౌస్ బాషా, మాదాల శ్రీనివాసులు నాయుడు మాట్లాడారు. అనంతరం మున్సిపాలిటీలో మేనేజర్‌గా పని చేస్తున్న మోహన కుమారిని ఘనంగా సన్మానించారు. ఆమె వలంటరీ రిటైర్మెంట్ పదవీ విరమణ చేశారు. దాంతో మున్సిపల్ చైర్‌పర్సన్ కమిషనర్ ఆమెను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆమెకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ

రూ.50వేలు నగదు దాతృత్వం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన 5 కుటుంబ సభ్యులకు శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, నిత్యా అన్నదాత శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున మొత్తం రూ.50 వేలు నగదును దాతృత్వం చేశారు. గత కొన్ని నెలలుగా ఆత్మకూరు పట్టణంలో మృతి చెందిన ప్రజలకు, వారి కర్మకాండల ప్రక్రియ కోసం నిత్యాన్నదాత, శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మృతిచెందిన కుటుంబ సభ్యులకు చేస్తున్న రూ.10వేల ఆర్థికసాయం కార్యక్రమం ఆత్మకూరు పట్టణంలో నిర్విరామంగా కొనసాగుతుంది. శనివారం ఆత్మకూరు పట్టణంలో నిత్య అన్నదాత శ్రీ కంచి పరమేశ్వర్‌రెడ్డి చేసిన దాతత్వం వివరాలు తెలిపారు. ఈ కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి మీ కుటుంబాలకు తానెప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించాడు. లబ్ధి పొందిన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమకు రూ.10వేల దాతృత్వం చేసిన నిత్య అన్నదాత శ్రీ కంచిపరమేశ్వర్ రెడ్డికి తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

నూరుశాతం విద్యా ప్రవేశం ఉండాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రభుత్వ పాఠశాలలో 1 నుండి 8 తరగతుల విద్యార్థుల నమోదు నూటికి నూరు శాతం ఉండాలని ఎంఇఒలు షేక్ మస్తాన్ వలీ, తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం వినూత్నంగా ప్రారంభించిన విద్యా ప్రవేశం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలీ మాట్లాడుతూ విద్యా ప్రవేశం అనేది ప్రభుత్వ వినూత్న కార్యక్రమం అని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం 1 నుండి 8వ తేదీ చదువు విద్యార్థులు నూటికి నూరు శాతం ప్రభుత్వ పాఠశాలలోనే నమోదు ఉండాలని ప్రతి పాఠశాలలో విద్యా ప్రవేశం నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడమే లక్ష్యంగా ఉండాలని మొదటి దశ ఈనెల 30, రెండో దశ జులై 25 వరకు ఈ కార్యక్రమంలో మండలాధికారులు అన్ని ప్రభుత్వ పాఠశాల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సభ్యులుగా ఉంటారని, వీరందరూ తప్పనిసరిగా దీక్ష యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని రిజిస్టర్ అవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చేపల వేట నిషేధం

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల ప్రాజెక్టు జలాశయంలో జూలై, ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధమని మత్స్యశాఖ ఉపసంచాలకులు శ్రీనివాసులు రావు శనివారం తెలిపారు. తల్లి చాప కోడి గుడ్డు దశలో ఉండడం వల్ల చేప పిల్లలు ఎక్కువగా ఉత్పత్తి అయ్యి మత్స్య సంపద పెరుగుటకు జలాశయంలో వేట చేసే మత్స్యకారులకు జీవనోపాధి కలగడం జరుగుతుందన్నారు. కనుక అక్రమంగా చేపల వేట చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రెండు నెలలు జాలర్లు, వ్యాపారస్తులు వేట చేయకుండా సహకరించాలని ఆయన కోరారు.

ప్రాజెక్ట్ ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న పొంగూరు శ్రీనివాసులు శనివారం ఉద్యోగ విరమణ సందర్భంగా తెలుగుదేశం మండల సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటిసి యోగు పెంచలయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి విరమణ పొందిన ఆయన సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పొంగూరు మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలను మెరుగుపరచాలి

- పెద్ద మస్తానయ్య వర్ధంతి సభలో డాక్టర్ ఎమ్‌వి రమణయ్య

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

పేదలకు వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అందుకు అనుగుణంగా ప్రభుత్వ వైద్యశాలలను మెరుగుపరిచే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని నెల్లూరు రామచంద్రా రెడ్డి హాస్పిటల్ ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఎమ్‌వి రమణయ్య అన్నారు. శనివారం పట్టణంలోని చెర్లో రమణారెడ్డి భవన్ సిపిఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు అధ్యక్షతన పెద్ద మస్తానయ్య 19వ వర్ధంతి సభను పురస్కరించుకొని, పెద్ద మస్తానయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు పెద్ద మస్తానయ్య కమ్యూనిస్టు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ సమావేశానికి వక్తగా డాక్టర్ ఎమ్‌వి రమణయ్య విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్యం అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని దానికి అనుగుణంగా ప్రభుత్వ వైద్యశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ, జిల్లాలలోనూ కార్పొరేట్ వైద్యశాలలో అభివృద్ధి చెందుతున్నాయని కార్పొరేట్ వైద్యం ధనికులు మాత్రమే వైద్యం పొందగలరని, పేదలకు కార్పొరేట్ వైద్యం అందదన్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాలలలో పేదలకు వైద్య అందించాలని, అలాగే ఉచితంగా వైద్యులను తయారు చేయాలనిన్నారు. రాబోయే రోజుల్లో పేదల వైద్యం అందే పరిస్థితి ఉండదని కాబట్టి వైద్యరంగాన్ని మెరుగుపరిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మెరుగుపరిచే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌలురైతు సంఘం నాయకులు గంట లక్ష్మీపతి, సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్, ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగం, డివైఎఫ్ఐ నాయకులు నంద శీను, గద్దర్ బాబు, కొండా లక్ష్మమ్మ, పలువురు సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఎమ్ వి రమణయ్య

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా బర్మాషెల్ గుంటలో అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బాధితులకు ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈఆర్ ట్రస్ట్ చైర్మన్ టి.ఎస్తేరు రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించి బాధితులకు నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరగడం చాలా బాధాకరమన్నారు. విషయం తెలిసిన వెంటనే తాము చెలించిపోయామని, బాధితులకు వెంటనే సాయం చేయడం జరిగిందన్నారు. పేద ప్రజలకు ఏ కష్టం వచ్చిన ఈఆర్ ఫౌండేషన్ వారికి అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఈఆర్ ట్రస్ట్ స్టేట్ కమిటీ డి జోనా, మండల అధ్యక్షులు పి.శ్రీనివాసులు, పి.హరికృష్ణ, వలంటీర్ మనోరంజిని, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MEKALA JAYALAKSHMI (Old Name) resident of D.No.27-2-1504, Nirmal Street,Near Police Quarters,Balaji Nagar, Nellore-524002,SPSR Nellore Dt.(A.P) hereby declare that I have changed my name as **DALAVAI LAKSHMI W/o DALAVAI VIJAYA KUMAR** (New Name) hereafter call all purpose in future.

అపరిశుభ్రతతోనే డయేరియా

ప్రజాశక్తి-కోవూరు : పరిసరాలు, చేతుల అపరిశుభ్రత తోనే డయేరియా వేగంగా వ్యాపిస్తుందని ప్రధానోపాధ్యాయులు చింతంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని రామచంద్రాపురం గిరిజన కాలనీలో విద్యార్థులతో కలిసి శనివారం డయేరియాపై ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ గ్రూపు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు వేదవతి, నిర్మల బ్రహ్మారెడ్డి, మున్వర్‌అహ్మద్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎ కాకర్ల వినూత్న ఆలోచన

ప్రజాశక్తి-కలిగిరి : ఉదయగిరి టిడిపి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ వినూత్న ఆలోచన చేశారు. తనను కలవటానికి వస్తున్న నియోజకవర్గ ప్రజలు బొకేలు, శాలువాలు తీసుకురావద్దని పిలుపునిచ్చారు. తనను కలవటానికి వచ్చే ప్రతిఒక్కరూ పెన్ను, పెన్సిల్, పుస్తకాలు తీసుకొని వస్తే పేద విద్యార్థులకు, ప్రతిభా ఉన్న విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కొత్తపేట గ్రామానికి చెందిన తెలుగుయువత నాయకులు మద్దినేని రమేష్, నాగోతు వెంకటేశ్వర్లు, పచ్చవ వంశీ, మేడసాని హరికృష్ణ, ఈర్ల రవీంద్ర, పులివర్తి వివేక్ పుస్తకాలు పెన్నులు, పెన్సిల్స్ తీసుకువచ్చారు.

అందుబాటులో వరి విత్తనాలు

ప్రజాశక్తి-మర్రిపాడు : ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో బిపిటి 5204 (ట్రూత్ ఫుల్లి లేబుల్డ్ విత్తనం) వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్త (సేద్య విభాగం) డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి తెలియజేశారు. 30 కేజీల బస్తా రూ.1260 కావాల్సిన రైతులు సెల్ నెంబర్ 7981644675ను సంప్రదించగలరని తెలిపారు.

రక్తదానంపై పునఃసమీక్ష

ప్రజాశక్తి-కావలి

కావలి ప్రాంతీయ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 17న జరిగిన ఆత్మీయ సమావేశానికి 'కొనసాగింపుగా' కావలి పట్టణంలోని రవి నర్సింగ్ హోమ్‌లో శనివారం కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు అధ్యక్షతన రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ఆదివారం కావలి 'ఇండియన్ మెడికల్ అసోసియేషన్' వారి ఆ ధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరం విషయమై పునఃసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక గౌరవాధ్య క్షులు డాక్టర్ బెజవాడ.రవి కుమార్, అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు మాట్లాడారు. జెవివి జిల్లా కార్యవర్గ సభ్యులు జి.కళ్యాణి, కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు గాదిరెడ్డి.మురళీ కృష్ణ, గుణకల.శివయ్య, సి.కల్లయ్య, జె.వి.వి.సంయుక్త కార్యదర్శి షేక్.ఖాదర్ భాషా, కావలి రూరల్ మండలం జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు ఎ.పద్మనాభం మీకోసం స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధి బాబ్జి, జిల్లా హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ మహమ్మద్. అలీమ్, ద మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ అధ్యక్షులు షేక్.రఫీ అహ్మద్, గుడ్ మాన్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సోమిశెట్టి. బ్రహ్మయ్య, కావలి పట్టణ జె.వి.వి. కార్యవర్గ సభ్యులు ఎం.వి.ఎన్. ప్రసాద్ రావు, మండవ. వెంకట రమణయ్య, మొగిలిశెట్టి. జమున తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెవివి నాయకులు

'విశ్వోదయ'కే మాల్యాద్రి జీవితం అంకితం

ప్రజాశక్తి-కావలి

కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో 36 సంవత్సరాల పాటు అహర్నిశలు పనిచేసి, సగం జీవితాన్ని విశ్వోదయ విద్యా సంస్థలకు అంకితం చేసి నేడు తన ఉద్యోగ బాధ్యతల నుండి విరమిస్తున్నారు. ఆయన కళాశాలలో వేలాదిమంది క్రీడాకారులను తయారు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చి దిద్దారు. కాగా ఆర్.మాల్యాద్రి ప్రకాశం జిల్లా కొండి కందుకూరు గ్రామంలో రాయి వెంగయ్య, లక్ష్మమ్మలకు 5వ సంతానంగా 1962, జులై, 1వ తేదీన జన్మించారు. వారి తల్లిదండ్రులకు ఆరుగురు సంతానం కాగా ఇద్దరు కుమార్తెలు, నలుగురు కుమారులు పుట్టారు. మాల్యాద్రి ప్రకాశం జిల్లా కరేడు గ్రామంలో పాఠశాల విద్య పూర్తిచేశారు. 1979-84లలో కావలి జవహర్ భారతి జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. అన్నమలై యూనివర్సిటీలో బి.పి.డి, ఎం.పి.డి, ఎంఫిల్ చేశారు. నాగార్జున యూనివర్సిటీలో పి.హెచ్.డి. పూర్తి చేశారు. సెప్టెంబర్, 1988లో జవహర్ భారతి కళాశాలలో హాస్టల్ వార్డెన్‌గా ఉద్యోగంలో చేరి, 12యేళ్లపాటు పనిచేశారు. క్యాంపస్ డైరెక్టర్‌గా 19 సంవత్సరాలు పనిచేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా 2సంవత్సరాలు పనిచేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా 5 సంవత్సరాలు పని చేసి, 2023లో 2నెలలు, 2024సంవత్సరంలో 2నెలలు జె బి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తు, ఈ నెల 30వ తేదీన ఉద్యోగవిరమణ చేస్తున్నారు. విశ్వోదయ విద్యాసంస్థల్లో ప్రతిఒక్కరికీ తలలో నాలికలా ఉండి, నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న మాల్యాద్రి లేని లోటు తీర్చలేనిది. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా ఆయన అందించిన సేవలు అనిర్వచనీయం. వేలాదిమంది విద్యార్థులను జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. ఆయన సతీమణి అపర్ణ, విశ్వోదయ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తూ, 9 సంవత్సరాల క్రితం తుదిశ్వాశ విడిచారు. ఆయనకు తేజస్విని అనే కుమార్తె, తరుణ్ అనే కుమారుడు ఉన్నారు. డాక్టర్ మాల్యాద్రి బహుముఖ ప్రజ్ఞవంతులు. ఆయన కళాశాలలో ఎన్నోరకాల అదనపు బాధ్యతలు స్వీకరించి, వాటికీ సంపూర్ణ న్యాయం చేశారు. క్రీడా మైదానంపై ఎత్తున ఉన్న చెక్ డ్యాం నిర్మాణం దగ్గరుండి పర్యవేక్షించారు. శంకరన్ హాల్ నిర్మాణం, పి.జి. బ్లాక్ నిర్మాణం, ఉమెన్స్ హాస్టల్ రెండు ఫ్లోర్‌ల నిర్మాణం, రుతురంగ్ గార్డెన్‌లోని డి.ఆర్. స్థూపం మాల్యాద్రి పర్యవేక్షణలో జరిగాయి. డాక్టర్ డి.ఆర్.కి మాల్యాద్రి అంటే ప్రత్యేకమైన దృష్టి. ప్రత్యేక వాత్సల్యం. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్ రెడ్డి, కరెస్పాండంట్ వి.సుధాకర్ రెడ్డి, విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్ కుమార్ రెడ్డిలు తనమీద చూపించే ప్రేమకి, భరోసాకి సర్వదా కతజ్ఞుడిని అని ఆర్.మాల్యాద్రి చెబుతుంటారు. ఉద్యోగ విరమణానంతరం వారి జీవితం ఆరోగ్యంగా, క్రియాశీలకంగా సాగాలని ఆశిద్దాం..

జెబి కళాశాల ప్రిన్సిపల్ ఆర్.మాల్యాద్రి

ప్రకటన

నా క్లయింట్ అయిన **జాలాది సావిత్రి, భర్త జాలాది లక్ష్మీ నరసింహారావు,** నివాసం: 11/4/116, బొమ్మా మాధవయ్య వారి స్ట్రీట్, సంతపేట, నెల్లూరు సిటీ అను వారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియ జేయడమేమనగా:- నాక్లయింట్ **తే12-01-1996 దిన టి.ఎస్.జగన్నాథ్ శెట్టియార్, సరస్వతి, జి.జయదేవ్, జె.శ్రీనివాసన్, జె.రంగనాథన్** గార్ల వద్ద నుండి ... జిల్లా, 177-... గ్రామములోని సర్వే నెం.343-2, సర్వే నెం.398-2, సర్వే నెం. 342-1ఎ, సర్వే నెం.340-7, సర్వే నెం.398-3, సర్వే నెం.343-6 లు లోని **యు3-82 సెంట్లు** భూమిని కొనుగోలు చేసినారు. Thirukazhukundram Sub-Registrar Office లో రిజిష్టరు కాబడిన **ఒరిజినల్ దాక్యుమెంటు నెం.1980/1996** ను జెరాక్స్ తీయుటకు నిమిత్తం నాక్లయింట్ **తే20-06-2024** దిన తన నివాసం నుండి ... మార్గమధ్యములో ఒరిజినల్ దాక్యుమెంటు పోయినది. సదరు **ఒరిజినల్ దాక్యుమెంటు నెం.1980/1996** ను ఎవ్వరికైనా దొరికినయెడల ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇచ్చిన యెడల తగిన పారితోషకం ఇవ్వబడును. సదరు ఒరిజినల్ దాక్యుమెంటు ఉపయోగించి ఎవ్వరైనా ఎట్టి లావాదేవీలు జరిపిన అవి చెల్లవు.

షేక్. రియాజ్ బాషా, బి.ఏ.ఎల్., బి.ఎల్., అడ్వకేట్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, ... సెల్: **93937 27765**

Before the Joint Commissioner of Labour For Workmen's Compensaion-I Chennai-6

I.A.No. 33 of 2024
WC.No. of 2024

Usapalli Kalyan Kumar
S/o Chinnabbi - Applicant
Versus
1. Shaik Ayub Saheb
2. Chola MS General Ins. Co. Ltd., - Opposite Party

To,
Shaik Ayub Saheb, C/o Shaik Sirajuddin, No.8-2-169, Sastri Nagar, Badvel, YSR Kadapa, Andhra Pradesh - 516 227. ... Opposite Party

Sir,
Please take notice that the above case has been posted to **11-07-2024** for your appearance, appear in person or through your pleader, failing which the matter will be decided in your absence.

Mr. M.PACHAIYAPPAN, B.A., B.L., Counsel for Applicant, Chennai.